క్లుప్తంగా

పెన్షనర్ల గోడు పట్టని కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న నాయకులు

విశాఖ విద్య: పింఛను దారుల సమస్యలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కనకేశ్వర రావు, దీనబంధు, హుస్సేన్ అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్రిపాలెంలోని పీఎఫ్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ కార్మికులు ధర్నాలో కూర్చొన్నారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అనేక మందికి రూ.వెయ్యి లోపు పింఛను వస్తుందని, అధికారంలోకి వస్తే రూ.3 వేలు మినిమం పింఛను చేస్తామని ప్రకటించినా ఆచరణలో విఫలమైందన్నారు.

రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధిగా శ్రీనివాసరావు

అగనంపూడి: రాష్ట్ర న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యునిగా అగనంపూడికి చెందిన తలారి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతికంశెట్టి సత్యనారాయణ నియామక పత్రాన్ని శ్రీనివాసరావుకు అందించారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ దర్జీలను ఆదుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టి.పుల్లయ్యనాయుడు, డి.ఎం.నాయుడు, దాసరి భాస్కరరావు, గంగాధర్, అంబటి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఐ దాలిబాబుకు అభినందనలు



సీఐ దాలిబాబుకు అభినందనలు తెలియజేస్తున్న పరదేశి, గోవింద్

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గింద్రి దాలి బాబును జీవీఎంసీ 75వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మార్టుపూడి పరదేశి, గంట్యాడ గోవింద్, గొందేశి శ్రీనివాసరెడ్డి, పిట్టారెడ్డి తదితరులు ఆయన్ను కలిసి, అభినందనలు తెలిపారు.

9న శ్రీవారి శాంతి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైయున్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత తిరుమలేశునికి ఈ నెల 9వ తేదీన సాయంత్రం 6 గంటలకు శాంతి కల్యాణం జరిపించనున్నట్లు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. శుక్రవారం స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రంతో పాటు మహాలక్ష్మి అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు, అమావాస్య సందర్భంగా ఉదయం 5 గంటలకు అభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

పెందుర్తి: పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో డి.నీలవేణి ఓ ప్రకటనలో తెలిపారు. పెందుర్తి మండలం గొరపల్లి, చింతలగ్రహారం-1, సరిపల్లి-2, జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం-1, 64వ వార్డు గొడ్డువానిపాలెం, 77వ వార్డు చిన్నపాలెం, 97వ వార్డు నారవానిపాలెం, 76వ వార్డు కర్ణవానిపాలెం, 75వ వార్డు నెల్లిముక్కు, 85వ వార్డు పెదమడక, 74వ వార్డు దల్లివానిపాలెం కేంద్రాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టుల కోసం ఈ నెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

మార్గం.. సుగమం

ఇది కదా అభివృద్ధి

- మలుపులు.. ఇరుకు రోడ్డుకు మోక్షం
- రూ.53 లక్షలతో రోడ్డుకిరువైపులా విస్తరణ
- వాహనచోదకుల టెన్షన్‌కు చెక్



హైవే మలుపు వద్ద విస్తరించిన మార్గం



నాడు: హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రహదారి బైట్ గేటుకు సమీపంలో ఇరుకు రోడ్డు



నేడు: క్యాన్సర్ ఆస్పత్రి రహదారి బైట్ గేటు వద్ద విస్తరించిన రహదారి

అగనంపూడి: మలుపులు.. ఇరుకు రోడ్డుకు మోక్షం కలిగింది. సుమారు రూ.53 లక్షలతో చేపట్టిన విస్తరణ పనులతో రోడ్డు కష్టాలు తీరాయి. గతంలో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించిన వాహనచోదకులు టెన్షన్ తప్పిందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 85వ వార్డు జాతీయ రహదారి ఏడుమెట్ల మద్రిపాలెం కూడలి నుంచి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి మీదుగా గొన్నవానిపాలెం (ఫార్మాసిటీ కాలనీ కూడలి) వరకు రెండు కిలోమీటర్ల దూరం భారంగా భావించేవారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చొరవ, వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి కృషితో రెండు వైపులా రహదారి 12 అడుగుల వెడల్పులో విస్తరణ చేపట్టారు. మొదటి విడత రూ.22 లక్షలతో మీటరున్నర వెడల్పు పనులు చేయగా, రెండో విడత పనుల కోసం జీవీఎంసీ మరో రూ.31 లక్షలు విడుదల చేయడంతో మొత్తం రూ.53లక్షల వ్యయంతో రహదారికిరువైపులా 12 మీటర్లు విస్తరణ చేపట్టారు.



నాడు: ఇరుకు, మలుపుల రహదారి



నేడు: మలుపుల వద్ద విస్తరించిన రహదారి

గతంలో ప్రమాదాలెన్నో..

అసలే ఇరుకు మార్గం.. ఆపై మలుపులు ఎక్కువగా ఉండడంతో కారు, బస్సు, భారీ వాహనాలు ఈ మార్గంలోకి ప్రవేశిస్తే ద్విచక్రవాహనచోదకులు తప్పుకునేందుకు కూడా వీలు లేకుండా పోయేది. దీంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. గతంలో రెండుసార్లు స్కూల్ బస్సులు తిరగబడగా, రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టిన సందర్భంలో ఒకరు మృతి చెందారు. దీంతో ఈ మార్గంలో వాహనాలపై ప్రయాణం అంటే హడలిపోయేవారు. రోడ్డు విస్తరణతో ఈ బాధలు తప్పాయని స్థానికులు, ఆస్పత్రికి వచ్చే రోగులు, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అటువైపు వెళ్లాలంటే భయం



ఈ మార్గంలో రాకపోకలంటే భయంగా ఉండేది. ఇరుకు రోడ్డు.. ఆ పై మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. చీకటి మరీ ఇబ్బంది పడేవాళ్లం. రహదారి విస్తరణతో ప్రమాదాల భయం తప్పింది.

– శ్రీనివాసరావు, ఫార్మాసిటీకాలనీ

నిర్వాసిత కాలనీవాసులకు తీరిన అవస్థలు



రహదారి విస్తరణతో ఆరు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు, మూడు గ్రామాల ప్రజలకు ఇరుకు రోడ్డు అవస్థలు తప్పాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ప్రయాణం టెన్షన్‌గా ఉండేది. రహదారి రెండు వైపులా విస్తరించడంతో ఆ కష్టాలు తీరాయి. జీవీఎంసీ మేయర్, కమిషనర్‌కు, గాజువాక ఎమ్మెల్యేకు కాలనీవాసుల తరఫున కృతజ్ఞతలు.

– ఇల్లపు వరలక్ష్మి, కార్పొరేటర్

‘ఉక్కు’ పోరాటంలో విజయం కార్మికులదే..

- విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 1090వ రోజుకు రిలే దీక్షలు



1090వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కార్మికులు చేస్తున్న పోరాటంలో అంతిమ విజయం కార్మికులనే వరిస్తుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 1090వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో మంగళవారం ఉక్కు నిర్వాసితులు, సంస్థకు చెందిన ఎంఎంఎస్ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో నిరసన తెలియజేస్తున్నా కేంద్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. నిరంతరాయంగా, శాంతియుతంగా నిరసన చేస్తున్న కార్మికులను గుర్తించాలని, ఇప్పటికైనా ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ కబడ్డీ విజేతలకు అభినందన



కబడ్డీ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న చందు

గాజువాక: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ఫైనల్స్‌లో విజయం సాధించిన గాజువాక కబడ్డీ జట్టును వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అభినందించారు. పాత గాజువాకలోని పార్టీ కార్యాలయంలో క్రీడాకారులకు ట్రోఫీ ప్రదానం చేశారు. ఫైనల్ పోటీల్లో గాజువాక కబడ్డీ జట్టు విశాఖ తూర్పు జట్టుపై విజయం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందని పేర్కొన్నారు. 75వ వార్డు పాత అయ్యన్నపాలెం గ్రామం నుంచి ఈ పోటీలకు హాజరైన కబడ్డీ జట్టు తమ గ్రామానికి, గాజువాక నియోజకవర్గానికి పేరు తెచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ శ్రీకాంత్, క్రీడాకారులు వెంకటేష్, సురేష్, మహేష్, దుర్గ, వీర, హేమంత్, భాను, వంశీ, రవి, సాయి, రూపేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే అటెండెన్స్ కొనసాగింపునకు వినతి



హెచ్‌ఆర్ జీఎం చక్రవర్తికి వినతిపత్రం అందిస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు యాజమాన్యం తలపెట్టిన బయోమెట్రిక్ పద్ధతిని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్టీల్ ఇంటక్ నాయకులు తెలిపారు. పాత అటెండెన్స్‌నే కొనసాగించాలని కోరారు. ఈ మేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు హెచ్‌ఆర్ జీఎం సాత్యకి చక్రవర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్టీల్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయకుండా, సమస్యలు పరిష్కరించకుండా బయోమెట్రిక్ ఎలా ఏర్పాటు చేస్తారన్నారని ప్రశ్నించారు. ప్లాంట్‌లో భద్రత, పని పరిస్థితులను ముందు సరి చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ.నాయుడు, దేముడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సంరక్షణతో కూడిన విద్య అవసరం



అంబేడ్కర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

మద్దిలపాలెం: అంగన్‌వాడీలో చదువుతున్న చిన్నారులకు సంరక్షణతో పాటు నాణ్యమైన విద్య ఎంతో అవసరమని విశాఖ అర్బన్-2 ప్రాజెక్ట్ సూపర్ వైజర్ వి.సెల్వియా అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు అంబేడ్కర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) డేను కార్యకర్త ఈర్ల దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్వీ చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ఫన్ యాక్టివిటీస్ నిర్వహించారు. రిమోట్ లెర్నింగ్ మెటీరియల్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రీ స్కూల్ చిన్నారుల్లో సమగ్ర అభివృద్ధి పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. ఇంటి వద్ద చిన్నారులకు విద్యపై ఆసక్తి కల్పించడానికి వీలుగా తల్లిదండ్రులకు చిన్నచిన్న బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సూచనలు, సలహాలను పాటించి చిన్నారుల్లో విద్యపై ఆసక్తి కల్పించేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి వి.భారతి చిన్నారుల విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పాఠశాల హెచ్ఎం జి.నాగమణి, ఏఎన్ఎం శైలజ, ఎంఎస్‌కే విజయలక్ష్మి, ఆశా ఎం.చింతతల్లి, సహాయకురాలు పి.కనకదుర్గ పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే కు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి

విశాఖ విద్య: పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డే విజయవంతం చేసేందుకు అంతా సిద్ధం కావాలని బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి సూచించారు. సచివాలయ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో మంగళవారం యూపీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యూపీహెచ్‌సీ పరిధిలోని 8 సచివాలయాల్లో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు గల 15,516 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన స్టాక్‌ను ముందుగానే తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాల్లో కూడా కార్యక్రమం చేపట్టాలన్నారు.

బీజేపీ ఎన్నికల కమిటీ నియామకం

గాజువాక: గాజువాక నియోజకవర్గ బీజేపీ ఎన్నికల కమిటీని మంగళవారం 52 మంది సభ్యులతో నియమించారు. ఈ మేరకు స్థానిక లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రకటించారు. అనంతరం వారికి వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, సోంబాబు, దీనంకొండ కృష్ణంరాజు, పొలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆ పనులను 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనచోదకులకు ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయన్నారు.

క్రీడా మైదానం పరిశీలన



ఏయూ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

జగదాంబ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ మంగళవారం ఆంధ్రా యూనివర్సిటీ క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారన్నారు. ఈ నెల 9 నుంచి 13 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు మహిళా క్రీడాకారిణులకు ఆంధ్రా యూనివర్సిటీ ఉమెన్స్ హాస్టల్లో ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఎంహెచ్‌వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ముగిసిన జాతీయ సదస్సు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారతీయ భాషల్లో విద్య-సాంకేతిక పదజాలం ప్రాధాన్యతపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో జరిగిన సదస్సులో పలువురు వక్తలు ప్రసంగించారు. అంతర్జాలం ద్వారా సాంకేతిక పదజాల నిర్మాణంలో నూతన పోకడలను వివరించారు.

అందరి సహకారంతో పర్యావరణ పరిరక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకురాలు

మల్కాపురం: మొక్కలు నాటడం,ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని జాతీయ సేవా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో మంగళవారం పర్యావరణంపై నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఒక్క మొక్క అయినా నాటాలని, రాష్ట్రం నలుమూలల మొక్కలు అధికంగా నాటే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో పలు ఔషధ మొక్కలు నాటారు.

‘రోజుకో సర్క్యులర్‌తో కార్మికుల్లో ఆందోళన’



స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం సోఫ్టీకి వినతిపత్రం అందజేస్తున్న సిటూ నాయకులు

ఉక్కునగరం: కార్మికుల్లో భయాందోళన కలిగిస్తున్న చర్యలను ఉక్కు యాజమాన్యం తక్షణం ఆపాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్ డిమాండ్ చేశారు. బయోమెట్రిక్‌కు వ్యతిరేకంగా స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం రోజుకో సర్క్యులర్ ద్వారా కార్మికుల్లో ఆందోళన కలిగిస్తూ ఉక్కు ఉత్పత్తికి అంతరాయం కలిగించే విధంగా చర్యలు చేపడుతోందన్నారు. కార్మిక సమస్యలను పక్కతోవ పట్టించేందుకు బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెడుతోందని విమర్శించారు. తక్షణం బయోమెట్రిక్‌ను విరమించుకోవాలన్నారు. మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణ, సన్యాసిరావు, కర్రా ప్రకాశ్ మాట్లాడుతూ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బంది పెడుతోందన్నారు. ఈ అంశంపై గుర్తింపు యూనియన్ స్పష్టమైన విధానంతో పోరాటానికి పిలుపు ఇస్తే, తాము మద్దతు ఇస్తామన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్టీకి వినతిపత్రం అందజేశారు. పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కృష్ణమూర్తి, మహేష్, శ్రీనివాస్, బాలశౌరి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి చందు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి పునరావాస కాలనీ పినమడక రామాలయం పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఉరుకూటి రామచంద్రరావు (చందు) మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని ఆకాంక్షించారు. నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చట్టి పెంటయ్య, అండిబోయిన రాము, అప్పారావు, చట్టి అప్పలస్వామి, ఏకుల వెంకటేష్ గౌడ్, కె.అప్పలనాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు రమణమూర్తి పంతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు సినిమా ఉత్సవం



హెచ్.ఎం.రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో తెలుగు సినిమా ఉత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు తొలి టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 92 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ ఆచార్య ఎస్.వి.ఎస్.దుర్గాప్రసాదరావు ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా భక్తప్రహ్లాద చిత్ర దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మానవ విలువలను సృశించే సినిమాలను ప్రజలకు చేరువ చేయడానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలు మంచి సినిమాలను చూసే సంస్కృతిని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఫిల్మ్ సొసైటీ ప్రతి ఏడాది ఉత్సవాన్ని జరుపుతోందన్నారు. అనంతరం 1955లో విడుదల అయి సంచలనం సృష్టించిన బంగారు పాప చిత్రాన్ని ప్రదర్శించారు. 7వ తేదీ సాయంత్రం జయభేరి చిత్రం, 8న బలగం చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చిన్నారావు, బాబ్జి, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి ఉషారాణి, అర్చన, కృష్ణారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య కీర్తనలు



వీణ కచేరీ చేస్తున్న కళాకారిణులు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీఐశ్వర్యలక్ష్మీ సౌభాగ్య లక్ష్మీ, సమేత వల్లభ వేంకటేశ్వర కల్యాణ ఉత్సవ ఆధ్యాత్మిక పీఠం వైభవోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వల్లభ వేంకటేశ్వర ఆధ్యాత్మిక పీఠం, వైదిక విజ్ఞాన విపంచి, విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మంగళవారం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ వారి అన్నమాచార్య కీర్తనలు అందరినీ అలరించాయి. దీంతో పాటు వీణ కచేరి, తబల వాయిద్యం ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి.